
మాతృత్వాన్ని
అభిలషించిన
ఆ స్త్రీ మూర్తి
కోరిక
నెరవేరిందా?

# సశేషం




ఆమె పేరు చిత్ర...

లేచి బయటకు వచ్చింది. ఉదయం వేళ ప్రకృతి అంతా తాజాగా, ఉల్లాసంగా, నవనవోన్మేషంగా కొత్త అందాలు వెదజల్లే వేళ... ఆమెకు మాత్రం ఏదో వెలితిగా అనిపిస్తోంది. అపార్ట్‌మెంట్ టెర్రేస్‌పై నిలిచి ఆమె మహానగరపు ప్రాతఃకాల అందాన్ని, కదలికల్ని కళ్లతో జుర్రుకుంటోంది. అక్కడి పేవ్‌మెంట్లమీద నిద్రించిన కొందరు అప్పుడప్పుడే బద్ధకంగా నిద్రలేస్తూ నిశ్చలమైన ఉదయవేళకు కదలికను తెస్తున్నారు. దూరంగా, దూరదూరంగా నగరానికి ఆవల పెట్టని కోటలవలె నిలిచిన కొండలమీది చెట్ల గుబుర్లలో బహుశః పక్షులు కిలకిలారావాలు చేస్తుంటాయి. ఆ సవ్వడి ఇక్కడ అపార్ట్‌మెంట్స్‌వరకు వినిపించదు. అపార్ట్‌మెంట్ మధ్యగా ఉన్న చిన్న మైదానంలో కొందరు పిల్లలు కేరింతలతో ఆడుకుంటున్నారు. ఆమె చూపులు వారిపై కేంద్రీకృతమయ్యాయి. ఆ మైదానానికి ఆనుకుని కొంచెం దూరంలో ఆవి ప్రక్కనే బస్ స్టాప్ వుంది. అక్కడే స్కూల్ బస్సులు ఆగుతాయి.

ఆ బస్సు స్టాపు దగ్గర రంగురంగల యూనిఫారాలతో పిల్లలు కలకలలాడుతూ బస్సులుఎక్కి స్కూళ్లకు వెళ్లి వస్తుంటారు.

ఆమె ఉదాసీనంగా నేలవైపు చూసింది. ఆకాశంవైపు చూసింది. నిర్లిప్తంగా, నిరామయంగా చూస్తున్న ఆమె ఏకాంతాన్ని భంగపరుస్తున్నట్లు ఒక పిచ్చుక, ఒక ఉడుత అక్కడకు వచ్చి ఆమెను పిలుస్తున్నట్లు కిచ్‌కిచ్ అన్నాయి. ఆమె అటు చూసింది.



రోజూ ఉదయం పూట ఆమే ఆ పిచ్చుకకు, ఆ ఉడతకు కొన్ని గింజలు ఆహారంగా వేస్తుంటుంది. ఆ అలవాటు చొప్పున అవి వచ్చి ధ్వని చేస్తున్నాయి.

ఆమె గబగబా లోపలకు వెళ్లి ఒక గుప్పెట బియ్యం, రెండవ గుప్పెట కందిగింజల్ని తెచ్చి అక్కడ వేసింది. పిచ్చుక బియ్యం గింజలవైపు వాలి తినసాగింది.

ఉడుత కందిగింజల్ని తమాషాగా తీసుకుని చిన్ని ముట్టితో కొరికి తినసాగింది. పది పదిహేను గింజల్ని అవి అలా నమిలేసరికి మరో పిచ్చిక, ఇంకో ఉడత వాటికి తోడయ్యాయి.

అవి పరస్పరం మాట్లాడుకుంటున్నట్లు ఒకదానినొకటి చూసుకుంటూ గింజల్ని తిని పిచ్చుకలు ఎగిరిపోయాయి. ఉడుతలు వెంగువ గెంతుతూ, తోక ఆడిస్తూ అక్కడి గోడమీదికు ఎక్కిపోయాయి.

అవి వెళ్లిపోగానే ఆమె ఎప్పటివలెనే ఒంటరితనాన్ని అనుభవిస్తున్నట్లు నిర్లిప్తంగా చూస్తుండిపోయింది.

పెళ్లై నాలుగేళ్లయింది. పిల్లలు పుడతారన్న ఆశ అడుగంటిపోయింది. మెలకువగా వున్నా, నిద్రపోయినా, బజారుకు వెళ్లినా, పెళ్లిళ్లకు, పేరంటాలకు వెళ్లినా ఆమెను ఈ వెలితి కలచివేస్తూనే వుంది. భోగిపళ్ల వేడుకలకు వెళ్లినప్పుడు, బొమ్మల బజారుకు వెళ్లినప్పుడు ఈ వెలితి మరీ బరువు అనిపిస్తుంటుంది.

భర్త కృష్ణమోహన్ ఆమె బాధను అర్థం చేసుకున్నాడు. ఆమె గురించిన ఆలోచన అతనిలో ఇప్పుడు బాధగా మారింది. ఆ సంగతి ఆమే కనిపెట్టింది. పిల్లలు లేరన్న వెలితితో ఆమె మొదట్లో వెక్కి వెక్కి ఏడ్చేది. ఒక్కోసారి భోజనం చేసేది కాదు. దీనితో కృష్ణమోహన్ మరీ బాధపడేవాడు.

తనగురించి భర్త మరీ బాధపడుతున్నాడని గ్రహించిన ఆమె ఇప్పుడు గంభీరంగా వుంటోంది. క్రమంగా ఆమెలో 'ఆరిందా' తనం వచ్చేసింది. పైగా డాక్టర్ని సంప్రదించారు. ఆమె ప్రత్యుత్పత్తి వ్యవస్థలో ఎలాంటి లోపం లేదని డాక్టర్ పరీక్షచేసి వివరంగా చెప్పింది. అప్పటినుంచీ ఆమె కృష్ణమోహన్ పట్ల మరీ జాగ్రత్త వహించసాగింది. అతను మానసికంగా కృంగిపోతాడని ఏకాంతవేళల్లో అతన్ని ఉత్సాహపరిచే మాటలు చెప్తోంది. అయినా ఒక్కోసారి తన వెలితిని తట్టుకోలేక వెక్కి వెక్కి ఏడుస్తూనే వుంది. అలాంటప్పుడు కృష్ణమోహన్ ఆమెను ఓదార్చి "చూడు చిత్రా జీవితంలో ఇది పెద్ద లోటే. కాదనను. కానీ నువ్విలా అయిపోతుండడం ఏం బాగాలేదు. ఇరుగుపొరుగు పిల్లల్ని చూసి కొంచెం సంభాళించుకోవడం నేర్చుకోవాలి" అనేవాడు.

"వదినగారి పిల్లలకి ఏడాదిపాటు ఎంత చేశాను. ఎన్ని చేశాను. నడక, పలుకు వచ్చాయి. నావైపు చూడడం లేదే. వదినగారు మాత్రం వన్ను గేలిచేయడమేమిటి" ఏడుపుతో ఎరుపెక్కిన కళ్లు తుడుచుకుంటూ చిత్ర భర్త భుజంపై వాలి ఉక్రోషంగా అనేది.

"అలా అనుకోకూడదు. ఎవరికేం చేసినా నిస్వార్థంగా చేయాలి. అదే మనకు మంచిది. వాళ్లిలా అన్నారు. వీళ్లలా అన్నారు అని పట్టించుకోకూడదు" కృష్ణ మోహన్ ఆమె భుజాలు నిమిరి, దగ్గరకు తీసుకుని గుండెలకు హత్తుకుని అనేవాడు.

ఆ తర్వాత ఇద్దరమూ దగ్గరయేవారు. ఒకరినొకరు రెచ్చగొట్టుకునేవారు. ఒకరినొకరు పెనవేసుకుపోయేవారు. అలసిపోయేవరకు ఆ ఆనందం అనుభవించేవారు. అటువంటి ఆనందం అనుభవించిన మరునాడు

కృష్ణమోహన్ ఆఫీసుకు వెళతానంటే చిత్ర వదిలిపెట్టేదికాదు. గోముగా గుండెలకు హత్తుకునిపోయేది.

"ఉద్యోగం లేకపోతే నీ కౌగిలి సేవకే అంకితం అయ్యేవాడిని. వూ... వదులు" అని కృష్ణ మోహన్ ఆమెను తననుంచి దూరంగా జరిపి అంతలో దగ్గరకు ఒక్క కుదుపుగా లాగి వదిలేవాడు.

"నాకు తోచదు. ఒంటరిగా వుండలేను" అని చిత్ర వెలితిగా అనేది.

"అయితే ఓ పని చేద్దాం. మా మేనత్త యశోద తెలుసుగా. ఆవిడ కొడుకున్నాడు. వాణ్ణి నీకు అప్పగించమంటాను. వాడితో ఆవిడ ఉద్యోగానికి వెళ్లలేకపోతోంది. ఇబ్బంది పడుతోంది" అన్నాడు కృష్ణమోహన్.


"ఆవిడ ఒప్పుకుంటారా?" చిత్ర ప్రశ్నించింది.

"అడిగి చూద్దాం"

"అయితే సాయంత్రం ఆఫీసునుంచి అటే వెళ్లి యశోద పిన్నిగారిని ఒప్పించి వాణ్ణి తీసుకురండి" చిత్ర తొందర చేసినట్లు అంది. కృష్ణమోహన్ వెళ్లిపోయాడు.

చిత్ర ఆలోచనలకు రెక్కలు వచ్చాయి. తూనీగలవలె ఎగరసాగాయి.

యశోద కొడుక్కి ఏడాదిన్నర వయసు. బొద్దుగా వుంటాడు. ముద్దుగా వుంటాడు. నవ్వితే వాడి బూరి బుగ్గలపై సొట్టలు తమాషాగా, లోకం అంతా అమాయకత్వం అలా అక్కడ సున్నాలా వున్నట్లుంటుంది. వాడిపేరు శ్యాం. ఇప్పుడిప్పుడే మాటలు వస్తున్నాయి. వాడు కనుక తన జీవితంలోకి వస్తే ఎంత కాలక్షేపం. ఎంత తెలివిలేనితనం. అందుకే చిత్ర బజారుకు వెళ్లి చిన్నది మూడుచక్రాల సైకిల్ కొన్నది. రకరకాల రంగురంగుల బట్టలు కొన్నది. వాడికి పక్క వేయడానికి అవసరమైన సంభారాలు సమకూర్చింది. ఈ ఏర్పాట్లలో ఆమెకు పొద్దే



తెలియలేదు. తీరా కృష్ణమోహన్ ఆ రాత్రి దిగాలుగా ఇంటికి వచ్చాడు. చిత్ర విచలిత అయింది.

"ఏమైందండీ?" ఆత్రంగా అడిగింది.

"ఓ వారం పోయాక అత్తయ్యే తీసుకువచ్చి దిగబెడతానంది" కృష్ణ మోహన్ నెమ్మదిగా అన్నాడు. చిత్రకు అసంతృప్తిలోనే తృప్తి అనిపించింది.

"పంపవన్నారేమో అని భయపడ్డాను" అంది అన్నం తింటున్న భర్త పక్కన కూర్చుని చిత్ర.

"అలా ఎందుకనుకున్నావ్" కృష్ణమోహన్ అడిగాడు.

"గొడ్రాలినికదా" చిత్ర ఈ మాట అప్రయత్నంగా అనేసి నాలుక కరుచుకుని భర్త ముఖంలోకి అపాలజిటిక్‌గా చూసింది. కృష్ణమోహన్ భళ్లున నవ్వాడు.

"కోపగించుకోవాల్సిందిపోయి నవ్వుతారేం?" చిత్ర ఉక్రోషంగా అంది.

"లోపం నాది. అయినా లోకం నింద నీపైవేసింది. అందుకని..." కృష్ణమోహన్ మాటల్లో న్యూనభావం స్ఫురించింది. మరి మాట్లాడలేక చిత్ర "సాంబారులో మిరియం పొడి ఎక్కువైనట్లుంది. మీ కళ్లు ఎర్రబడి నీళ్లు వస్తున్నాయి" అని మంచినీళ్ల గ్లాసు అందించింది.

ఆ పైవారం యశోద వచ్చి పిల్లాణ్ణి అప్పగించి, వాడి అలవాట్లు, అవసరాలు, అల్లర్లు గురించి చెప్పి వెళ్లిపోయింది. శ్యాంకి కొత్త లేదు. ఎంత అపరిచితులతో అయినా సరే ఇట్టే కలిసిపోతాడు. తల్లికోసం బెంగలేదు. ఈ గుణాలు వుండడంవల్లనే వాడు చిత్ర దగ్గర బాగా అలవాటైపోయాడు. ఇల్లంతా వాడిమాట ముద్దే.

శ్యామ్‌తో చిత్ర అనుబంధం పెంచుకోవడాన్ని పసిగట్టిన కృష్ణమోహన్ ఒకనాడిలా అన్నాడు.

"అంత ప్రేమ పెంచుకోకు"

"ఏం?"

"వాడు మన దగ్గరే వుంటాడనుకున్నావా?"

"వుంచేసుకుంటాం"

"అంటే?"

"వాడికి చదువు సంధ్యల్ని ఇక్కడే చెప్పిద్దాం"

"నాలాగా బ్యాంక్ ఆఫీసర్ని చేస్తావా?"

"ఉహూ!"

"మరి"

"ఇంజనీర్ని చేస్తాం. గ్రేట్ ఇంజనీర్!"

"నీ ఆశల్లాగే యశోద అత్తయ్యకూడా కలలు కంటుంటుంది"

"ఆవిడ నా మాట కాదనదు"

"నా పిల్లాణ్ణి నాకిచ్చేయమంటే?"

"ఇవ్వను. వాడు నా కంటిదీపం"

"వాడిపై మనకు అధికారం ఏం వుందని?"

"అధికారం వుంటనే అన్నీ అయిపోతాయా?" శ్యామ్‌ని గుండెలకు హత్తుకుని కళ్లనీళ్లని అదుపు చేసుకుంటూ అంది చిత్ర.

శ్యాం తనను౦చి దూరమైపోతాడా? పెద్దయినాక వెళ్లిపోతాడేమో? తనని మరచి

పోతాడేమో? యశోద పిన్నివాణ్ణి తన దగ్గరే వుండనిస్తే? వుండనివ్వకపోతే? ఈ ఆలోచనలు ఆమెను కలవరపరుస్తున్నాయి. క్షణకాలం ఉత్సాహం. క్షణకాలం నిర్లిప్తత ఆమెను వేధిస్తున్నాయి. శ్యామ్ పట్ల ఆమె ప్రేమ అంతా ఇంతా కాదు. కాని శ్యామ్ ఎవరి బిడ్డో అన్న వాస్తవాన్ని ఆమె మరచిపోతోంది. శ్యామ్ లాలనతో ఆటపాటలతో ఆరు నెలలు గడిచిపోయాయి. ఒకనాడు యశోద నుంచి కబురు వచ్చింది.

"నాకు ట్రాన్స్‌ఫర్ అయింది. వెళ్లాలి. శ్యామ్‌ని తీసుకురండి" అని ఆ కబురు సారాంశం.

"ఏమండీ! శ్యామ్ మన దగ్గరే వుండి చదువుకుంటాడని, వాణ్ణి బ్రహ్మాండంగా చదివిస్తానని చెప్పండి" చిత్ర శ్యామ్‌ని విడిచిపెట్టలేనంత గట్టిగా పట్టుకుని అభ్యర్థనగా అంది.

"వాళ్లకు ఒక్కడే కొడుకు" కృష్ణమోహన్ ఆమెను సముదాయిస్తూ అన్నాడు.

"మరో బిడ్డ పుడతాడులెద్దురూ" చిత్ర చాలా ఈజీగా ఈ మాట అని సీరియస్‌గా అతని కళ్లల్లోకి చూసింది.

"ఇంక పిల్లలు వద్దమనుకున్నారు వాళ్లు" కృష్ణ మోహన్ ముక్తసరిగా సమాధానం చెప్పి ఊరుకున్నాడు.

అప్పటికే చిత్ర కళ్లల్లో నీళ్లు గూళ్లుకట్టాయి. ఆ మరునాడు యశోద రానే వచ్చింది. శ్యామ్‌ని తీసుకు వెళ్లిపోయింది. వాడికోసం కొన్న బొమ్మల్ని, ఆట వస్తువుల్ని ఒక్కటేమిటి అన్ని సామాన్లని చిత్ర ప్యాక్ చేయించి పంపించివేసింది... అప్పుడప్పుడు నిద్రలో 'శ్యామ్' అని పలవరిస్తుంటుంది. ఇప్పుడామె దగ్గర వున్నవి శ్యామ్ జ్ఞాపకాలు... వందల ఫోటోలున్న ఆల్బమ్.

◇ ◆ ◇

మరొకసారి ఆమె జీవితాన్ని శూన్యం

## ప్రేమ—పెళ్ళి

"నీకోసం నా ప్రాణమైనా ఇస్తాను రాణీ!"

"ప్రాణం వద్దుగానీ కట్నంకింద ఓ యాభైవేలు నర్దు"

"నాకు కట్నం వద్దు రాణీ"

"నీక్కాదు. కుమార్‌తో నా పెళ్లి కుదిరిందిలే"

—షెహన్ (గొల్లప్రోలు)



ఆవరించింది. అంతా నిశ్శబ్దం. ఒంటరితన ం. చివురించిన ఒక్క ఆశా భగ్నం అయిపోయింది.

ఆమెకు వూరట కలిగించాలని కృష్ణ మోహన్ ఆమెను ఊళ్లు తిప్పాడు. పుస్తకాలూ, నవలలూ కొని ఇచ్చాడు. కేసెట్లు తెచ్చి పడేశాడు. అయినా ఆ యాంత్రిక వ్యవస్థలేవీ ఆమెకు జీవసుందర శిశుస్పర్శాభావ తృప్తిని ఇవ్వలేదు. ఎప్పటిలా గానే ఆమె ఉదాసీనంగా, నిర్లిప్తంగా వుంటో ంది.

''చిత్రా! నువ్వు నన్ను ఎక్కువగా బాధపెడుతున్నావ్'' అన్నాడు కృష్ణమోహ న్ ఒకనాడు.

''నన్ను అర్థం చేసుకోండి'' వేడికోలుగా అంది చిత్ర.

''ఎప్పుడూ ఒంటరిగా వుండేవాళ్లని చూసి నేర్చుకోవాలి'' కృష్ణమోహన్ హితవు , ధైర్యం చెప్తున్నట్లు అన్నాడు.

''నేను విభాయించుకోలేకపోతున్నాను. నావల్ల కావడంలేదు''

''మరో వస్తువుగురించి ఆలోచన చెయ్యి''

కాని చిత్ర ఒంటరిగా వున్నప్పుడు ఆలోచిస్తే పిల్లలకోసం తానెందుకంత వివశు రాలవుతోంది? సంతానమే జీవితానికి తొలి తుదిఫలమా? ప్రకృతిలో, బతుకుబాటలో ఇంకా ఎన్నో వస్తువులున్నాయికదా. ప్రకృతి, చెట్లు, పూలు పకులు, సంగీతం, చిత్రలేఖ నం, ఫోటోగ్రఫీ... ఎన్నిలేవు. వీటిలో తనకు ఫోటోగ్రఫీ ఇష్టం. నేర్చుకుంటే కొంత కాలక్షేపం. దృష్టి మరలుతుంది. ఒక కళా మాధ్యమాన్ని ఎంచుకుంటే ఎంత వ్యాప్తి! ఎంత వ్యాపకం! ఎంత పరిశోధన! ఎంత పని!

''నేను ఫోటోగ్రఫీ నేర్చుకుంటాను'' అంది భర్తతో చిత్ర.

''వెరీగుడ్! మంచి ఫీల్డ్. ఇవాళ జాతీయ , అంతర్జాతీయ స్థాయిలో పోటీలు జరుగుతు న్నాయి. నువ్వు బాగా శ్రమ పడితే ప్రైజెస్ సంపాదించగలవు. ప్రొసీడ్!'' భార్యని ప్రో త్సహిస్తూ అన్నాడు కృష్ణమోహన్.

''ఫోటోగ్రఫీలో నా సబ్జెక్ట్ ఏం అవుతుం దో చెప్పండి'' చిత్ర భావగంభీరంగా అడిగింది. కృష్ణమోహన్ ఆమె కళ్ల లోతుల్లో కి సమాధానాన్ని అన్వేషిస్తూ చూశాడు తప్ప ఏం చెప్పలేకపోయాడు.

''పిల్లలు! పిల్లలు!'' చిత్ర ఉత్సుల్ల భావుక స్వరంతో అంది. ఇంగుతిన్ని కృష్ణ మోహన్ తమాయించుకుని...

''ఇంకా బోలెడున్నాయి. ఒకదాన్ని మిం చి మరోటి'' అని మాట పొడిగించబోయా డు. చిత్రం అతనికి ఆ అవకాశం ఇవ్వకుం డాఫఫఫ

''పిల్లల్ని మించిన సజీవ సుందరమైన సబ్జెక్ట్ ఏం లేదు'' అని అంది. కృష్ణమోహన్ మౌనం వహించాడు.

◇ ◆ ◇

ఫోటోగ్రఫీకి సంబంధించిన ఎన్నో పుస్త కాలు కొంది చిత్ర. ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్లి దరఖాస్తు ఫామ్ తెచ్చి, వేసి ఇచ్చింది. ఒకటి రెండురోజుల్లో ఫోటోగ్రఫీ ఇన్‌స్టి ట్యూట్‌లో చేరాలనుకుంది. ఈ లోగానే ఆమెకు బాబాయి వరుస అయ్యే ఒకాయన కూతురు వైద్యానికి వచ్చి చిత్రదగ్గర మకాం

పెట్టాడు. కృష్ణమోహన్‌కి తెలిసిన డాక్టరుచేత ఆ పిల్లని చూపించాడు. ఆమె వయసు ఎనిమిది సంవత్సరాలు. ఆ తండ్రికి ఎనిమిదవ సంతానం. పెద్ద విలువ ఏం వుంటుంది. ఆమెపేరు పల్లవి. డాక్టర్ పరీక్షించి 'ఎనిమిక్' అని, కొన్నిరోజులు వుండి వైద్యం చేయించుకోమని సలహా ఇచ్చాడు. ఆయన చిత్ర ఇంట మకాం చేయడంలో చిత్రకి ఆ పిల్లపట్ల మమకారం ఏర్పడసాగింది.

''పోషణ సరిగా వుంటే పల్లవి ఎంతో బాగా పెరిగేది'' ఆయన భోజనాలదగ్గర ఓసారి అన్నాడు.

''అవును బాబాయ్! నాజూకైన పిల్ల'' అని ఊరుకుంది చిత్ర.

''మీ దగ్గర వుంచుకుంటారా?'' ఆయన అడిగాడు.

''ఆయన్ని అడిగి చెప్తాను'' అంది చిత్ర. మాటవరుసకు అలా అందికాని ప్లలవిని తన దగ్గర వుంచుకోవాలని ఆమెకూ వుంది. పైగా పేదరికంలోంచి వచ్చిన పిల్ల కనక తన దగ్గర నమ్మకంగా వుంటుందనే ఆశ చిత్రకు వుంది. ఆమాటే భర్తతో అంది.


''ఎందుకు మళ్లీ ఈ సమస్య తెచ్చి పెట్టుకుంటావ్? ఏదైనా అయితే ఏడుస్తావ్'' కృష్ణమోహన్ మందలింపుగా అన్నాడు.

''నే చూసుకుంటాగా! మీరు 'వూ' అనండి'' అంది చిత్ర. భర్తచేత అంగీకరింపజేసింది.

''బాబాయ్! ఆయన ఒప్పుకున్నారు. నువ్వు నిశ్చింతగా వెళ్లిపో. 'ఎనిమియా'కనక మంచి మందులు, పుష్టి ఇచ్చే ఆహారం మేం చూస్తాం. మీ పిల్లకేం ఫర్వాలేదు. మేం వున్నాం'' చిత్ర ఆయనకు భరోసా ఇచ్చి పంపేసింది.

ఆరోగ్యం కుదుటపడి పల్లవి ఆ పట్టణ వాతావరణానికి అలవాటు పడడానికి, అలా ఆ పిల్లను మలచడానికి కొన్ని నెలలు పట్టింది. పల్లవిలో వచ్చిన మార్పుకి చిత్ర

## ఆకుల పచ్చదనం



ఆకుల్లో క్లోరోఫిల్ వుండడంవల్ల పచ్చదనం వుంటుంది. ఆకుల్లో పసుపుపచ్చని క్యాంటోఫిల్, కాషాయ, ఎరుపుల కోరోటిన్, ఎర్రటి యాంథోసియానిన్ ఉన్నా క్లోరోఫిల్ సంపూర్ణంగా వుండడంవల్లే ఆ రంగు వస్తుంది. చలికాలంలో ఆకులు రాలిపోతాయి. క్లోరోఫిల్ అప్పుడు ఆకుల్లోంచి మాయమైపోతుంది. కనకే రంగు మారిపోవడం జరుగుతుంది.

— శారవి

ఎంతగానో ఆనందపడింది. కోల్పోయిన ఆనందం నట్టింటికి తిరిగి వచ్చినట్లు చిత్ర తృప్తిపడసాగింది. మరల జీవితంలోని ఒంట రితనాన్ని చిత్ర మరచిపోసాగింది.

పల్లవికి స్వయంగా చిత్ర చదువు చెప్పిం ది. స్కూలుకు అలవాటు చేసింది. మంచి మంచి డిజైన్లలో బట్టలు కుట్టించి స్వయంగా ఆమెకు ముస్తాబు చేసేది. పల్లవి ఏం కోరుకుంటే అది అమరే ఏర్పాటు చేసింది. కృష్ణమోహన్ కూడా ఏ అడ్డూ చెప్పేవాడుకా దు. పల్లవితో చిత్ర అనుబంధం చాలా బలపడిపోయింది. పాతజ్ఞాపకాల్ని వదిలేసి కొత్త బంధాల్ని పెనవేయడంలో మనసు చేసే గారడీ అంతా ఇంతా కాదు. ఇలా ఏడాది గడిచింది. పల్లవిని బాబాయ్ తమకు పెంపు ఇచ్చేస్తాడన్న నమ్మకం చిత్రకి, కృష్ణమోహన్‌కి కలిగింది.

దత్తత మాట జ్ఞాపకం రాగానే చిత్రకు చిత్రమైన ఆలోచనలు వచ్చేవి. పల్లవి పెద్దద వుతుంది. పెళ్లి అవుతుంది. అత్తవారింటికి పంపించివేయాలికదా. ఈ ప్రశ్న కలిగినప్పు డు చిత్రకి అంతశ్చేతనలోంచి జవాబు వచ్చేది.

''ఇల్లరికం అల్లుణ్ని తెచ్చుకోవాలి''

ఈ లోగా పల్లవికి సంగీతం నేర్పించాలి. నాట్యం నేర్పించాలి. మంచి డిగ్రీ చేయించా లి. ఎలాంటి పెళ్లికొడుకు వచ్చి ఏ ప్రశ్న వేసినా సమాధానం చెప్పే విద్యాబుద్ధుల్ని పల్లవికి కలిగించాలి. ఇవే చిత్ర ఆలోచనలు. ఇందుకు తగినట్లుగానే ఆమె పల్లవిని తీర్చిది ద్దే ప్రయత్నం చేస్తోంది.

ఒకరోజు జడ వేస్తూ చిత్ర పల్లవితో ఇలా అంది. ''పల్లవీ! నువ్వు ఎప్పటికీ మా దగ్గరే వుండిపోతావ్''

''సరేకానీ మా నాన్నా, అమ్మా కబురు పెడితే వెళ్లవద్దా?'' పల్లవి అమాయకంగా అడిగింది.

''మేం నిన్ను బాగానే చూస్తున్నాం కదమ్మా?'' చిత్ర అడిగింది.

''ఆ! ఆ!'' పల్లవి గోముగా అని చిత్రకి దగ్గరగా ఇమిడిపోయేది. ఈ ఏడాది కాలంలో బాబాయ్, పిన్ని నెలకో, రెండు నెలలకో ఒకసారి వచ్చి రెండు మూడు రోజులు వుండి పల్లవిలో వస్తున్న మార్పుల్ని పోషణ తెస్తున్న కండపుష్టిని చూసి తృప్తిచెంది వెళుతుండేవారు. ఆవాళ మరోసారి వచ్చారు . ఈ రాకపోకలవలన పల్లవి మానసికంగా వాళ్లకి కట్టుబడి వుండిపోతుందనే అనుమాన ం చిత్రకి వచ్చింది. ఆ మాటే భర్తతో అంది.

''వీళ్లిలా రాకపోకలు సాగించడం?''

''పల్లవిని నువ్వు ఒక్కసారైనా పంపకపో తే వాళ్లే వచ్చి చూస్తారు. ఇది సహజం''

''పంపిస్తే దాని చదువు, సంగీతం పాఠాలు, డేన్స్ క్లాసులు. ఆ పల్లెటూర్లో ఇవేం లేవుగా?'' చిత్ర అంది.

ఇంక భార్యాభర్తల మధ్య మాటలు సాగలేదు. ఈ రాత్రి పల్లవి అటూ ఇటూ తిరగడాన్ని చిత్ర పసిగట్టింది. మరునాడుద యమే బాబాయ్, పిన్ని వెళ్లిపోయారు. రెండురోజులు మామూలుగానే గడిచాయి.

మూడవనాడు ఉదయం ఆఫీసుకు వెళ్తు న్న భర్తకు డబ్బు ఇద్దాం అని చిత్ర అలమారా తెరిచింది. దానిలో డబ్బు తక్కు

వ వుంది.

''మీరు డబ్బు తీశారా?'' చిత్ర కృష్ణ మోహన్‌ని అడిగింది.

''లేదే!'' అతను జవాబిచ్చాడు.

''మరి ఏమైనట్టు?''


''నువ్వే మరిచిపోయుంటావ్! ఖర్చులేం చేశావ్ గుర్తు తెచ్చుకో! దేవుడి మందిరంలో, అలమారాలో అన్నిచోట్లా వెతుకు'' కృష్ణ మోహన్ ఆజ్ఞాపించినట్లు చెప్పి భార్య ఇచ్చిన పాకెట్‌మనీ తీసుకుని వెళ్లిపోయాడు.

చిత్ర ఇల్లంతా వెతికింది. డబ్బు కనిపించలేదు. కాని ఆరోజునుంచి పల్లవిపై నిఘా వేసి వుంచింది. ఆ అమాయకం పిల్లని త్వరలో ద్దు తీసుకోవాలనుకుంటున్న పిల్లని అనుమానించడం తప్పుఅనీ, అనుమానం అగ్నివంటిదనీ అంతరాత్మ హెచ్చరిస్తున్నా చిత్రమాత్రం పల్లవిపై కన్నువేసి వుంచింది.

పల్లవి తనని మోసగిస్తుందా? అసలు అలా చేయాలని ఆ పిల్ల ఆలోచించగలదా? ఈ ఇంటిలో దానికి లోటేం వుంది? అని ఒకవైపు మనసు ఆలోచిస్తుంది. రెండవవైపు బుద్ధి వేరే విధంగా హెచ్చరిస్తోంది.

''మనుష్యులు వాళ్లు పిల్లలైనా, పెద్దలైనా ఎప్పుడూ ఒకేలా వుండరు. ఆ పిల్లపై నీకెందుకంత పిచ్చి నమ్మకం. రూపాయిబిళ్ల ముఖం తెలీని ఆ పిల్లదాని తల్లిదండ్రులు ఇంత డబ్బు చూస్తే వాళ్ల కళ్లు కుట్టవా? ఆలోచించు. వాళ్ల అవసరం అలాంటిది. అయినా ఒక్కసారి పల్లవి పుస్తకాల పెట్టె, బట్టల అలమారా వెదికిచూడు. నిజం తెలిసిపోతుంది. అనుమానం వుండదు''

బుద్ధిచేసిన హెచ్చరిక వారం రోజుల తర్వాత చిత్రపై పనిచేసింది. అప్పుడూ పనిచేయకపోను. కాని అంత క్రితం రాత్రి భర్త జేబులో మరచిపోయిన యాభై కాగితం మరునాడుదయం లేదు. దానితో చిత్ర అనుమానం పెరిగి అన్వేషణకు ప్రేరేపించింది. పల్లవి హాలులో ఎవరో పిల్లలతో కబుర్లు



ఆడుకుంటున్న సమయంలో చిత్ర ఆమె బట్టల అలమరా తెరిచింది. బట్టలకింద వెతికింది. ఆశ్చర్యం! ఊహించనిది, ఊహిం చలేనిది జరిగింది. అనుమానమే నిజం అయింది. ఆ బట్టల మడతల కింద పదులు, ఇరవైలు, యాభైలు, వందలు కొన్ని రూపా యి నోట్లున్నాయి.

ఎప్పుడూ ఇంటో దేనికీ తాళాలు వేయడం ఎరుగని తను పల్లవిని నిర్మలమైన, అమాయకమైన పిల్లగా భావించి ఎంత పొరపాటు చేశానో అనుకుంది. పల్లవి తల్లిదండ్రులు తరచుగా ఎందుకు వస్తున్నా రో ఆమెకు అర్థమైంది. ఇంతవరకు తనకు తెలియకుండా ఎంత డబ్బు పోయిందో ఎంత డబ్బును పల్లవి తల్లిదండ్రులకిచ్చిందో ఎలా తెలుస్తుంది?

చిత్ర మనసు పరిపరివిధాల పోయింది. పల్లవిని ఏమనాలి? ఏం చేయాలి?

ఆలోచిస్తుండగానే ఆవాళ ఎందుకనో కృష్ణమోహన్ రోజుకన్నా ముందుగా ఇంటికి వచ్చేశాడు. అతనికి ఫలహారం పెట్టి ఉపచా రాలు చేసి అతను రిలాక్స్ అయ్యాక చిత్ర ఈ సంగతిని చెప్పింది. అతను షాక్ తిన్నాడు. కొంచెం సేపు ఆలోచించాడు.

''నువ్వు ఆ పిల్లనేం అనద్దు'' అన్నాడు భార్యతో.

''అలా ఊరుకుంటే అది పాడైపోతుంది' చిత్ర అంది.

''అయితే?''

''దాన్ని కేకలేస్తాను. వాళ్ల అమ్మానాన్నని పిలిపించి సంగతి చెప్పేస్తాను'' ఆమె పట్టుద లగా అంది. కృష్ణమోహన్ ఎంత చెప్పినా వినిపించుకోలేదు.

ఆ రాత్రి భోజనాలయ్యాక పల్లవిని ఎదురుగా కూర్చోబెట్టి చిత్ర అనేక విధాలు గా ప్రశ్నలు వేసింది.

''పల్లవీ! కొంచెం డబ్బుకావాలమ్మా! నీ దగ్గర డబ్బులున్నాయా?'' అని అడిగింది.

పల్లవి ఏమీ తొణకకుండా వదురు బెదురు లేకుండా ''లేవు. నా దగ్గర డబ్బులెలా వుంటాయి. మీరిచ్చిన పాకెట్ డబ్బులు ఎప్పటికప్పుడు ఖర్చు పెట్టేస్తున్నా గా?'' అని బదులు చెప్పింది. చిత్ర అదే ప్రశ్నని మార్చి మార్చి అనేక విధాలుగా అడిగింది. పల్లవి అలాగే వాబిచ్చింది.

సహనం నశించిన చిత్ర తెచ్చిపెట్టుకున్న కోపంతో పల్లవి చెంపలపై రెండు దెబ్బలు వేసింది.

''మరి ఈ డబ్బులన్నీ ఎక్కడివి? దొంగతనం చేస్తావా? దొంగతనం. పైగా బద్దాలు చెప్తావ్! అబద్దాలు. పో! ఇక్కడిమం చి పోవే! నిన్ను నేనెంత ప్రేమగా, గారంగా చూసుకున్నానే. నీకేలోటూ రానివ్వలేదే. మరి నువ్వు చేసిందేమిటి?'' అని విసురుగా పల్లవి వడ్డిపై నాలుగు దెబ్బలు వేసి తాను తన గదిలోకి వెళ్లిపోయింది.

◇ ◆ ◇

రెండు రోజుల తర్వాత పల్లవిని వాళ్ల ఇంటిదగ్గర దింపించేసింది చిత్ర.

ఇప్పుడు మరల ఒంటరితనం. ముక్కలై పోయిన ఆశలు, పగిలిపోయిన ప్రేమానురా గాలు ఆమెను మరింత వేధిస్తున్నాయి. ఎంతగా హుషారుగా ఉందామన్నా మనసు కలిసిరావడంలేదు. ఆమెలోని కృతకృత్యాన్ని

కృష్ణమోహన్ గుర్తించకపోలేదు.

"చిత్రా! ప్రపంచంలో పిల్లల గొడవ తప్ప మరే యావగేషన్ లేదంటావా ఎంత ప్రపంచం వుంది! ఎంత డైవర్సిటీ వుంది! ఎన్ని విషయాలున్నాయి?" ఒకనాడు తన ఒడిలో తలపెట్టుకుని ఉదాసీనంగా పడుకుని శూన్యంగా చూస్తున్న చిత్రతో అన్నాడు. ఇదివరకు ఆమెకూడా ఇలాంటి ఊహలు చేసింది.

"ఏమో నాకవేం తెలియవ్! నాకు పిల్లలు కావాలి. మనస్సును ఎంత మళ్లించు కుందామన్నా ధ్యాస అటే మళ్లుతోంది" చిత్ర విచార, గంభీర, శూన్య స్థితుల్ని ఒకేసారి అనుభవిస్తున్నట్లు భారంగా అంది.

"అయితే ఢిల్లీ ఎ.ఐ.ఐ.ఎం.ఎస్‌లో సెమన్ బ్యాంక్ సౌకర్యం వుందట. అక్కడ గైనకాలజిస్ట్‌ను సంప్రదిద్దామా? నీకు కృత్రిమ గర్భధారణకు అవకాశం వుండచ్చు. "ఏం?" కృష్ణమోహన్ అడిగాడు.

"వద్దు. మీకేం పిచ్చి పట్టిందా? మీకీ ఆలోచన ఎలా వచ్చిందసలు?" చిత్ర సూటిగా ప్రశ్నించింది.

"అదికాదు చిత్రా! ఎందరో ఈ పద్ధతిద్వారా సంతానవంతులవుతున్నారు. తేడా ఏం వుండదు" కృష్ణమోహన్ ఆమెను ఒప్పించాలని అన్నాడు.

"బోలెడు తేడా వుంటుంది. నాకు మీ సంతానం కావాలి. వేరేవారిది వద్దు" చిత్ర స్పష్టంగానే అంది.

"సరే! ఇంక ఈ మాట తేనులే" కృష్ణమోహన్ ఆమె కళ్ల లోతుల్లో స్పష్టాతిస్పష్టంగా కనిపిస్తున్న మాతృత్వకాంక్షని చూస్తుండిపోయాడు.

◇ ◆ ◇

కాని అప్పటి నుండి చిత్రలో అంతర్మథనం ప్రారంభం అయింది. ఇంతవరకు జరిగిన సంఘటనలు ఆమెకు ఒక్కొక్కటిగా గుర్తుకు వస్తున్నాయి.

## మందు


"రాత్రిళ్లు సరిగా నిద్రపట్టడంలేదు. మంచి మందివ్వండి డాక్టర్‌గారూ!"

"ఏం చేస్తుంటావు నువ్వు?"

"నైట్ వాచ్‌మన్ ఉద్యోగం"

"???"

—పి.సరోజ (అమలాపురం)



భర్తలేని సమయంలో ఎంత ఒంటరితనం!

ఇరుగుపొరుగువాళ్ల గుసగుసలు!

జనం ఎంతటి మోసకారులో, ఎంతటి నయవంచకులో.

అందుకే ఆమె ఇప్పుడు పుస్తకాలు తెగ చదువుతోంది. కళ్లు అలిసిపోయేవరకు చదువుతోంది. కళ్ల కింద సన్నటి చారలుకూడా వచ్చేస్తున్నాయి. మరీ అలసిపోయినప్పుడు ఇంటిలో ఒంటరిభూతంవలె ఆమె తిరుగాడుతోంది. జీవితం అంతా యాంత్రికంగా మారిపోతోంది. ఒక్కొక్కసారి ఏమీ తినాలని అనిపించడంలేదు. ఏ పనీ చేయాలనిపించడంలేదు.

ఇరుగుపొరుగు పిల్లల్ని పిలిచి వాళ్లకు ఏవైనా పెట్టి తాను తినాలనుకున్నా సాధ్యం కావడంలేదు. పల్లవి తోటి అనుభవం, శ్యాంతోటి చేదు అనుభవం ఆమెను విచలితురాల్ని చేసేస్తున్నాయి. అటువంటి సందర్భాలలో ఆమె గుండెలదురుతున్నాయ్. మనస్సు ఉద్విగ్నసంభరితం అవుతోంది. లోపం తనలో వుంటే కృష్ణమోహన్ వేరే వివాహం చేసుకుని సంతానాన్ని పొందే వీలుండేది. కాని పరిస్థితి తారుమారు అయింది. లోపం అతనిలో వుంది. అతని వోజస్సుకు సంతానప్రాప్తినిచ్చే శక్తిలేదు. అంచేత తాను కృత్రిమ గర్భధారణ చేసి, బిడ్డని కన్నా ఆ బిడ్డ ప్రతి కదలికా కృష్ణమోహన్ వంధత్వాన్ని సవాలు చేస్తున్నట్లు, అతని పురుషాహంకారాన్ని కించపరుస్తున్నట్లు వుండవచ్చు. అంచేత తాను కృత్రిమ పద్ధతులద్వారా తల్లి కారాదు. ఇలాంటి ఆలోచనలలో చిత్ర మెదడు మొద్దుబారిపోసాగింది. ఆమెలో నానాటికీ ఉత్సాహం చచ్చిపోతోంది. కృష్ణమోహన్ ఆమె స్థితిని గమనించాడు.

"చిత్రా! నా సంతోషంకోసం నువ్వేం చేయగలవు?" ఒకనాడు ఏకాంతంలో ప్రశ్నించాడు.

"ఏదైనా సరే" ఆమె అంది.

"అయితే నువ్వు నవ్వుతుండాలి. ఆనందంగా తిరుగుతుండాలి" కృష్ణమోహన్ అన్నాడు.

"నేను హాయిగా నవ్వుతూనే వున్నానుగా" కృత్రిమత్వాన్ని ముఖంపైన పులుముకునే ప్రయత్నం చేస్తూ చిత్ర అంది.

"నిజంగా?" కృష్ణమోహన్ సూటిగా అడిగాడు.

"మనం ఒకరికోసం ఒకరం వున్నాం. విడదీసి ఎందుకు మాట్లాడతారు?"

"ఆ మాటే నేను నిన్ను అడుగుతున్నాను. నువ్వు నానుంచి ఏదో దాస్తున్నావ్?" కృష్ణమోహన్ సీరియస్‌గా అడిగాడు.

"ఏం లేదు" ఆమె క్లుప్తంగా అంది.

"అయితే నా సంతోషంకోసం ఒక్కటి చెయ్యి" కృష్ణమోహన్ ఆమె చుబుకం ఎత్తి కళ్లల్లోకి సూటిగా చూస్తూ అన్నాడు.

"ఆ సంగతేనా? వదిలేయండి. జరిగే పనికాదు. అది తప్ప వేరే ఏదైనా చెప్పండి చేస్తా" చిత్ర కృత్రిమ గర్భధారణ ప్రతిపాదనను మనసులో వుంచుకుని తిరస్కరిస్తూ అంది.

"నేను సంతోషంగా వుండాలని నువ్వు కోరుకుంటున్నావా? లేదా?" కృష్ణమోహన్ మరల అడిగాడు.

మీ ఆనందమే నే కోరుకున్నా,

కానీ?''

''చిత్రా! నువ్వు తల్లివైతే ఆ బిడ్డకి తండ్రిని నేను కాదా?''

''అది జరిగేపనికాదు. నన్ను ఇబ్బంది పెట్టవద్దు''

''అంటే లోకం నన్ను నపుంసకుడన్నా నీకు ఫరవాలేదన్నమాట. చిత్రా! బంధువులు, మిత్రులు నాగురించి రకరకాలుగా అనుకుంటున్నారు. అవి నన్ను బాధించడమే నీకు ఇష్టం అన్నమాట'' కృష్ణమోహన్ ఆమెను నిలదీశాడు.

''అసలు సంగతి మనిద్దరికీ తెలుసు. నేను తల్లినైతే ఆ అవమానం మీదే!'' చిత్ర గద్గద కంఠంతో అంది.

''నువ్వు ఒప్పుకో చిత్రా!''

''ఒప్పుకోను''

''నువ్వు నన్ను ప్రేమించడంలేదా?''

''ప్రేమిస్తున్నాను''

''ఆరాధించడం లేదా?''

''ఆరాధిస్తున్నాను''

''అని అనగానే సరిపోదు. నువ్వు తల్లివి కావాలి.''

''కుదరదు''

ఆ తర్వాత కొన్నివారాలు ఇద్దరూ చాలా మౌనంగా ఒకరికొకరు ఏమీ కావట్లు మసులుతూ వచ్చారు. జంటగా వున్నా ఎవరికి వారు ఒంటరితనాన్ని భయంకరంగా అనుభవిస్తూ వచ్చారు. చివరకు దంపతుల జీవన మార్గంలో పరచుకున్న ఉదాసీనం గాజుపెంకుల్ని ఒకనాడు ఎవరికి వారు ఏరివేసుకున్నారు.

మూడునెలల తరువాత ఇద్దరూ ఢిల్లీ వెళ్లారు.

◇ ◆ ◇

చిత్ర మనస్సు అంగీకరించడంలేదు. ఈ వేదనని భరించడంకంటే ఏ విషం మాత్రో మింగి చచ్చిపోవాలనిపిస్తోంది. ఈ

## ఫార్ములా!



13 సం. మద్రాస్ ముఖ్యమంత్రిగా పనిచేసిన కామరాజ నాడార్ బహు సీదా సాదా మనిషి. బ్రహ్మచారి. అయినా అతనికి స్వంత ఇల్లు, ఆస్తి, కారుకూడా లేదు. తల్లికి 50 రూపాయలిచ్చేవాడు సంసారం నడపడంకోసం. ఇదెందుకూ చాలదురా అబ్బాయీ అని తల్లి గొడవ పెడ్తే, గొణిగితే, ''నేను చచ్చిపోయిన తర్వాత నీకెక్కువ పింఛను దొరుకుతుంది అమ్మా!'' అని జవాబిచ్చేవాడా పుణ్యతరత్నం. ఏ పనినిగూర్చి అడిగినా ఆయన జవాబు మాత్రం 'పార్క్లాం' (మార్దాం) అనే!

— అమృతుని రాజ్యశ్రీ

బలవంతపు చికిత్స ఎంతో దుర్భరం. అనివార్యంగా, అసంకల్పితంగా తనకు చేసిన ఈ చికిత్సకు మూలపురుషుడు ఎవరు? ఎవరో? పుట్టేబిడ్డకు అసలు తండ్రి ఎవరో? ఏం జరుగనున్నది? తానేం చేయాలి.

స్త్రీపురుష జీవరసాయనాల కలయిక అసంకల్పితమా? సంకల్పితమా? ఇది తాను కోరుకున్న సంతానమా? బలవంతపు మాత ృత్వమా? చిత్ర ఎటూ తీర్మానించుకోలేకపో తోంది.

ఇలాంటి సందిగ్ధ సమయంలో కృష్ణ మోహన్ ఆమెకు ధైర్యం చెప్తున్నాడు.

"చిత్రా! పుట్టే బిడ్డని నేను ప్రేమగా చూడనని నీ అనుమానమా? అలాంటి భయం వద్దు. ఆ బిడ్డ మన బిడ్డ" అనేవాడు కృష్ణమోహన్.

"కాని నాకా నమ్మకం కుదరడంలేదు"

"అలాంటప్పుడు నీకూ, సామాన్య స్త్రీకీ తేడా ఏముంటుంది? ఇలాంటి ప్రత్యేక సందర్భాలలోనే మనం మానవత్వంతో ఆలో చించాలి"

"కాని మనం అసాధారణ మానవులం కాం. ఇలాంటి వాటిని సహజాతిసహజంగా జీవితాంతం స్వీకరించలేం"

"చిత్రా! ప్రతీ మాటకూ విపరీతార్థా లూ, విచిత్ర ఆలోచనలు చేయకు. శాంతం గా, ఆనందంగా వుండు. అప్పుడే మంచి బిడ్డ పుడతాడని డాక్టర్ చెప్పాడు. నీ మనో వైకల్యాల భయాలు పెరిగే బిడ్డని ఆవరించ నివ్వకు" ఆమె గర్భాన్ని నిమురుతూ కృష్ణమో హన్ అనునయించేవాడు.

ఈ ఆర్టిఫిషియల్ ఇన్సెమినేషన్ చికిత్స అయిన మొదటి వారాలలో ఆమె విపరీతం గా కలవరించేది. విచిత్రంగా ప్రవర్తించేది. క్రమంగా ఆమె పరిస్థితి మెరుగు అయింది. నాలుగవ నెల పూర్తి అయ్యేవరకు ఆమె ఏదో పాపం చేసినట్లు భీతిల్లేది.

ఐదవ నెల వచ్చేసరికి ఆమె మనో లోకమే మారిపోయింది. ఆమె ప్రతిక్షణం ఆనందంగా వుంటోంది. తన ఆరోగ్యం గురించి, తన కడుపులో పెరుగుతున్న బిడ్డ ఆరోగ్యం గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోసాగి ంది. మంచి మందులు వాడుతోంది. ఎక్సర్‌సైజులు చేస్తోంది. చక్కటి పుస్తకాలు చదువుతోంది. సుగమసంగీతం వింటోంది. షికారుకు వెళ్లివస్తోంది. గర్భిణీ స్త్రీలకు వైద్యులిచ్చే సలహాలను తు.చ తప్పక పాటిస్తో ంది. ఆమెలో ఈ మార్పు కృష్ణమోహన్‌కి ఎంతో ఆనందాన్ని, తృప్తినీ కలిగించింది.

◇ ◆ ◇

నెలలు నిండుతున్నాయి. చిత్రలో, చిత్ర మనస్తత్వంలో చిత్రాతిచిత్రమైన మార్పు లు వచ్చాయి. వస్తున్నాయి. భర్త సాన్నిధ్యంలో ఆమె తన గర్భంలో జరుగుతున్న మార్పులు అనుభూతికి వస్తున్న కదలికలు గురించి భావావేశంతో ఏకరువు పెడుతోంది.

"ఏమండీ! కడుపులో బిడ్డ కదులుతోం ది. ఈ ప్రక్క మీ చేయి వేసి చూడండి. ఏదో గాలి పీలుస్తున్నట్లు అనిపించడంలేదూ! మాతృత్వం ఇంత మధురమైనదని మగవాళ్ల కెలా తెలుస్తుందిలెండి. ఇది పేగు పెనవేసు కున్న స్పర్శాసుఖం. మీ మగవాళ్లకి ఈ స్పర్శ లేదు. ఈ పలకరింపులోని మాధుర్యం

తెలేదు. ఇది ఒక చెప్పలేని తీయని అనుభూతి''

ఆమె అలా అంటున్నంతసేపూ కృష్ణమోహన్ ఆమె ముఖంవైపు చూస్తుండిపోతున్నాడు. ఆమె ముఖంపై అలౌకికమైన కాంతి. అలాంటి కాంతిని ఇంతవరకూ చూడలేదు. పుట్టబోయే బిడ్డకోసం ఆమె ఎన్ని కలలు కంటున్నదో సాక్ష్యం ఇచ్చేటట్లు ఆమె వాడే మందులు, తీసుకునే జాగ్రత్తలు, అల్లే స్వెట్టర్‌లు, కుట్టే చిన్ని చిన్ని గౌన్లు, జుబ్బాలు, కొనే బొమ్మలు సాక్ష్యం ఇస్తున్నాయి. వాటిని, తనని మనోహరంగా మార్చి మార్చి చూసే భర్తవైపు ఆశ్చర్యంగా చూసి చిత్ర అడిగింది.

''ఏమండీ! మీకు ఆనందం అనిపించడంలేదు. నిజం చెప్పండి. అబద్ధం చెప్పద్దు. మీరేం అనుకుంటున్నారో చెప్పండి''

''చిత్రా! నీ ఆనందమే నా ఆనందం. నువ్వెంత ఆనందంగా వుంటే నాకెంత ఆనందంగా తృప్తిగా వుందో, నువ్విన్ని సంవత్సరాల ఎంత దుఃఖాన్ని వెలితిని అనుభవించావో ఇప్పుడు అర్థమవుతోంది. ఇప్పుడు నీకు ఆనందంగా వుందికదా!'' అని ఆమెను దగ్గరకు హత్తుకునే ప్రయత్నం చేసేవాడు.


''ఆ! ఆ! లోపలి బిడ్డ నలిగిపో...'' అని ఆమె సుతారంగా అతనికి తగిలీ తగలనంత దూరం జరిగి పడుకునేది.

ఆ స్పందన, ఆ స్పర్శ, ఆ కదలిక, ఆ పేగు బంధం, ఆ అనుభూతి అలాంటిది. అవి తల్లి అయ్యే స్త్రీ మాత్రమే చెప్పగలదు. అనుభూతికి తెచ్చుకోగలదు.

◇ ◆ ◇

కాని...

కృష్ణమోహన్ ఇదివరకటికన్నా ఎక్కువ సిగరెట్లు కాలుస్తున్నాడు. ఏవేవో పత్రికలు కొనితెచ్చి విపరీతంగా చదువుతున్నాడు. అంటే అతను ఆనందంగా, తృప్తిగా లేదు.



మరి పైకి ఎంతో హుషారుగా, తృప్తిగా కనిపిస్తున్నాడు. ఇది నటనా? ఏమో! తెలీదు

కానీ అతను అలాంటివాడు కాదు. మరి ఇన్ని సిగరెట్లు ఎందుకు కాలుస్తున్నాడు? విపరీతంగా ఈ చదువు ఏమిటి? చిత్రకి ఏమీ అర్థం కావడంలేదు.

◇ ◆ ◇

ఇంక నెలరోజులలో పురుడు వస్తుందని డాక్టర్ చెప్పింది... తేదీకూడా ఇచ్చింది. ఒకటి రెండురోజులు ముందుగానే వచ్చి ఆస్పత్రిలో జాయిన్ అవ్వమంది. చిత్రకి ఆ ముహూర్తపు నిరీక్షణ కష్టంగా వుంది. ఆమె మనస్సు హృదయం, ఆత్మ, శరీరంలో ప్రతిభాగం ఆ అద్భుత అపూర్వ అనుభవం కోసం తహతహలాడుతున్నాయి. కృష్ణమోహన్ మనస్సును భయంకరమైన నిశ్శబ్దం, శూన్యత్వం, ఒంటరితనం ఆవరిస్తున్నాయి. పుట్టిన బిడ్డకి తామరక్తంసంబంధీకుడు కాననే భావం అతడిని కృంగదీస్తోంది. అతనిలోని లోపం, ఆత్మన్యూనతాభావాన్ని జాగృతం చేస్తోంది. ఆ ఆలోచన అతన్ని కుదిపివేస్తున్నది.

ఆ బిడ్డ నా బిడ్డ కాదు. నేను చేసినదేమిటి? పుట్టే బిడ్డ సంస్కారాలు ఏమిటి? ఎలా వుంటాయి? నన్ను ప్రేమిస్తుందా? ప్రేమించదా? నా అంశ ఏమీ లేదే! రక్త సంబంధాలు అయితేనే శాశ్వతంగా వుంటాయి.

ఇలాంటి ఆలోచనలు కృష్ణమోహన్ని విచలితుణ్ని చేస్తున్నాయి. ప్రసవ సమయం దగ్గర పడేకొద్దీ అతనిలోని నిర్లిప్తత పెరుగుతోంది. అతడిని అజ్ఞాతమైన ఒక అనుమానం, దుఃఖం, భయం పీడిస్తున్నాయి.

''ఎందుకలా వుంటున్నారు'' చిత్ర అడిగింది కృష్ణమోహన్ని ఒకనాడు.

''ఏంలేదు... నీకు గర్భం వచ్చినప్పటినుంచి నేను అనాథాశ్రమానికి వెళ్లడమే లేదు. అక్కడి పిల్లలకు ఏదీ పెట్టడమే లేదు. అదేదో వెలితిగా అనిపించింది.'' కృష్ణమోహన్ అందమైన అబద్ధం ఆడాడు.

''ఇంక ఆ ధ్యాస ఎందుకు?''

''అక్కడ ఎంత ఆనందం లభిస్తుందని?''

''అంటే?''

''అమాయకులైన ఆ పిల్లల ముఖాలలో వెలిగే ఆనందాన్ని వెలకట్టలేం చిత్రా! రేపు ఉదయం వెళ్లి చూసివస్తాను''

''పిల్లలేరన్న ధ్యాస ఇంక వదిలేయండి. నేను తల్లిని కాబోతున్నాను. మీ ప్రేమ, మమకారం,...'' చిత్ర మాటని కృష్ణమోహన్ త్రుంచివేశాడు.

''నీ బిడ్డకు పంచిపెడతాను. నీ అనుమానంతో నా లోపాన్ని పదే పదే గుర్తుచేయకు'' కృష్ణమోహన్ విసుక్కున్నాడు.

అతను ఈ భావ సంఘర్షణని నిభాయించుకోలేకపోతున్నాడు. చిత్రని ద్వేషిస్తున్నానా అనే వరకు అతడి మానసిక స్థితి వికృతరూపం ధరించింది. అందుకే చిత్రను గాఢంగా ప్రేమిస్తున్నానన్న భావం కలిగించాలి అని ప్రయత్నిస్తున్నాడు. ఆ ప్రయత్నం ఎంత తీవ్రరూపం ధరిస్తుందో అంతటి శూన్య భావం అతడిని క్రమ్ముతోంది.

◇ ◆ ◇

ఒకటి రెండు రోజులలో చిత్ర పురుడుకై ఆసుపత్రిలో చేరబోతోంది. కొందరు

స్నేహితులు, బంధువులు వచ్చి చూశారు.

"ఎంత చిత్రం. అంతా విధి. పిల్లలే పుట్టరనుకున్న మీకు చక్కనిబిడ్డ... మగబిడ్డే పుడతాడు. ఏం సందేహం లేదు"

చిత్ర ఆస్పత్రికి పంపుతూ బంధువులూ, స్నేహితులూ అన్న మాటలివి.

◇ ◆ ◇

దీర్ఘకాల నిరీక్షణ ఫలం... ఆ ముహూర్తం రానే వచ్చింది.

చిత్రకు పురుటినొప్పులు ప్రారంభం అయ్యాయి. ఆ బాధకన్నా ఆమె ముఖంనిండా తల్లిని అవుతున్నానన్న భావగరిమతోటి వింతకాంతి వ్యాపించింది. అందుకే ఏడుపుకు బదులు ఆమె మందహాసం చేస్తోంది.

కాని కృష్ణమోహన్ మనస్సులో మాత్రం అబద్ధం తండ్రివి... నకిలీ తండ్రివి... పరాయి తండ్రిని వంటి భావాలు లావా విరజిమ్ముతున్నాయి. అతడు కృత్రిమ సంతోషాన్ని అభినయిస్తున్నాడు.

"పారిపో! ఈ అబద్ధంనుంచి పారిపో" అని మనసు ఘోష పెడుతోంది. "ఇక్కడ తాను లేకుండా వుంటే ఎంత బాగుండునో కదా" అనిపిస్తోంది.

చిత్ర ఆస్పత్రిలో వున్నన్ని రోజులూ యాంత్రికంగా, మొక్కుబడికోసం వచ్చి చూసివెళుతున్నాడు. తర్వాత ఆఫీసు పని చూసుకోవడం, అక్కడా, ఇక్కడా నిర్విరామంగా తిరగడం... ఏం చేస్తున్నా, ఎక్కడ వున్నా అతని తలనొప్పి పెరుగుతోందే తప్ప తరగడంలేదు. అతని బంధువులూ, స్నేహితులూ అన్న మాటలే గుర్తుకు వస్తున్నాయి.

"మేం చెప్పలే! మగపిల్లాడే పుడతాడని. అదే జరిగింది. అమ్మపోలికో అబ్బపోలికో పురిటిస్నానం అయ్యాక తెలుస్తుంది. ఏం పేరు పెడతావ్? దేవుడిపేరా? మీ కుటుంబ పెద్దల పేరా? మీ నాన్నగారి పేరా? మోడర్న్ పేరా?"

## కన్నీళ్లు

"ఏరా మీ నాన్న చనిపోయినా నీకు కన్నీళ్లు రాలేదు?" సినిమా హీరోని అడిగాడు స్నేహితుడు.

"ఏడ్చేవాణ్నేరా. కంగారులో గ్లిజరిన్ తెచ్చుకోవడం మర్చిపోయాను!"

—షెహెన్ (గొల్లప్రోలు)



''ఈ మాటలు చెవులకు ప్రతిధ్వనించి నప్పుడు అతని మనస్సు మరీ అతలాకుతలం అవుతోంది.

''అయినా కొద్దిరోజులు ఆగాలికద. బిడ్డకి పురిటిచర్మం ఊడిపోయి కొత్త చర్మం వస్తుంది. మూగతనం పోయి సంజ్ఞలు వస్తాయి. నిద్రపోవడమేతప్ప వేరేలోకం తెలీని పసివాడి పేరు గురించి ఇంత తొందరా?'

అని అతను తప్పించుకుందుకు ప్రయత్ని స్తున్నాడు. కాని స్నేహితులు, బంధువులు అలా ఊరుకోరుగా.

''నీ కళ్లు చిన్నవైతే అలాగే వుంటాయి. ముక్కు వెడల్పైతే అలాగే వుంటుంది'' అని బిడ్డ కళ్లని, ముక్కునీ కృష్ణమోహన్ కళ్లు, ముక్కుతో పోలుస్తున్నారు.

''నుదురుమాత్రం వాళ్ల అమ్మది'' మరొకరు అంటున్నారు. ఇలా రకరకాల పోలికలు తెస్తున్నారు. కృష్ణమోహన్ మాత్రం ఎవరితో వాదించడంలేదు. నవ్వి ఊరుకుంటున్నాడు.

ఆస్పత్రినుంచి చిత్ర బిడ్డతో ఇంటికి వచ్చింది. ఆ రాత్రి ఆ బిడ్డని తదేకంగా, పరీక్షగా చూశాడు కృష్ణమోహన్.

తన రంగుకాదు, తన జుట్టుకాదు, తన ముక్కుకాదు. తన కళ్లుకావు. రంగు వేరు. వెడల్పయిన ముఖం. వెంబ ముక్కు, చిన్న చిన్న కళ్లు మొద్దుగా వున్న పెద్ద పెద్ద పెదాలు.

''మీ పోలిక కాదు'' చిత్ర అంది అప్రయత్నంగా.

''మా తాతగారి పోలికేమో?'' కృష్ణమోహన్ న్యూనతాభావాన్ని లోపలే దిగమింగుకునే అన్నాడు.

''ఎలా వున్నాడు?'' మాతృత్వపు గర్వరేఖలు ముఖంపై ప్రకాశించగా చిత్ర బిడ్డకి కొంగుచాటున పాలిస్తూ అడిగింది.

''నీకు బాగున్నాడుకద!''

చిత్ర ఆ జవాబు విని నివ్వెరపోయింది. అయినా ఏమీ అనలేదు. దీర్ఘ శ్వాస వదిలింది.

బిడ్డ కృష్ణమోహన్‌వలె లేడు. వుండడు. అయినా తల్లికి తన బిడ్డ ఎన్నడూ కురూపివలె కనిపించదు. ఇదివరకు భర్తని గంటలతరబడి ఎలా లాలించేదో ఇప్పుడు బిడ్డని అంతకన్నా ఎక్కువ లాలిస్తోంది. ఆమెకు బిడ్డ తోడిదే లోకం అయింది. కృష్ణమోహన్ పత్రికలూ, పుస్తకాలూ చదువుకుంటూ గడుపుతున్నాడు. చిత్ర సాధారణ గృహిణివలె, తల్లివలె బిడ్డ భవిష్యత్తు గురించి కలలు కంటోంది.

''ఏమండీ వీడిని ఏం చదివిద్దాం?'' అని అడిగింది.

''నీ ఇష్టం'' కసురుకున్నాడు కృష్ణమోహన్.

''మీరేం చెప్తే అది'' ఆమె చిన్నబుచ్చుని అంది.

''వాణ్ణి నువ్వేదో పెద్ద ఇంజనీర్ని చేసేగాలనుకుంటున్నావ్. అలాగే కానీయ్! మెరికా పంపిద్దామా?'' కృష్ణమోహన్ పహాసంగా అన్నాడు.

''ఏమిటండీ ఆ మాటలు? వాడంటేం లేదా మీకు? ఎందుకంత నిర్లిప్తంగాంటున్నారు?'' చిత్ర నిలదీసి అడిగింది.

''చిత్రా! వీడంటే నీకెంత కమిట్‌మెం

ట్ వుందో నాకూ అంతే వుంది. అయినా నువ్వు నన్ను అనుమానిస్తూనే వున్నావ్!'' కృష్ణమోహన్ ఛీత్కరిస్తున్నట్లు అన్నాడు.

చిత్ర మరి మాట్లాడలేదు. పిల్లాడి ప్రస్తావన వచ్చినప్పుడు ఇలాంటి సన్నివేశాలు మామూలైపోయాయి. ఎప్పుడైనా పిల్లవాడ్ని అతనికి అందిస్తే చాలా తక్కువ సేపే ఎత్తుకుని వెంటనే ఆమెకు అందించేస్తున్నాడు కృష్ణమోహన్.

''ఆ బిడ్డ చిత్ర బిడ్డ. నీ బిడ్డకాదు'' అనే భావం కృష్ణమోహన్‌లో వికృతరూపం ధరించి అదే అతడి ప్రవర్తనలో వెల్లడి అవుతోంది. అతడి ఈ విచిత్ర ప్రవర్తనని చిత్ర పసికట్టకపోలేదు.

''ఏమండీ! వాడంటే ఎందుకంత ద్వేషం! మనస్సు మార్చుకోలేరా? ఆ అమాయకుడు చేసిన తప్పేవిటి? ఇది సృష్టిలో ఒక భాగం. వాడికి తండ్రి వాత్సల్యం కావాలి. తండ్రి లాలనని పంచి పెట్టండి. మీరు వాడినుంచేకాదు నానుంచికూడా ఎందుకు పారిపోతున్నారు? నన్ను బలవంతపెట్టింది మీరు'' ఆమె భర్త మనస్సుని బిడ్డవైపు మరల్చాలని ప్రయత్నం చేస్తోంది.

కాని... కాని... కృష్ణమోహన్ ఆలోచనలు వేరు. వాడు ఎవరి బిడ్డో తెలీదు. వాడినెలా కొడుకుగా స్వీకరించడం. ఎవరితోనో తండ్రిని చేసి ఇప్పుడు తాను తండ్రిగా ఎలా సర్దుకుపోగలడు? ఈ ద్వంద్వ భావ సంఘర్షణలో అతడు మరీ వివశుడైపోతున్నాడు.

అతడి ప్రవర్తన మారలేదు. చిత్ర మనస్సు మాత్రం బిడ్డపై మక్కువని మరీ పెంచుకుంటోంది. భర్తపట్ల సానుభూతి మరీ పెరుగుతోంది. అతను రాత్రింబవళ్లు అర్థంలేని ఆలోచనలతో సతమతం అవుతున్నాడు. మానసికంగా దిగజారిపోతున్నాడు. అయినా ఎవరి భావాలతోనూ, ఎవరి సంఘర్షణలతోనూ పనిలేనట్లు కాలం వడివడిపోతోం

## విచిత్ర పుష్పాలు



అతి పెద్ద పుష్పం రెఫ్లేషియా ఆర్నోల్డి సుమాత్ర అడవిలో కన్పడుతుంది. దీని చుట్టుకొలత ఓ గజం వుంటుంది. ఈ పూవు దళం మట్టుకొలత ఓ అంగుళం. తూకం 11 కె.జి.లు పూవు వికసించాలంటే 5నుంచి 7 రోజులు పడుతుంది. ఆరెంజ్ బ్రౌన్ మిశ్రమం రంగులో వుండే ఈ పువ్వు సువాసన లేకపోయినా కీటకాల్ని ఆకర్షిస్తుంది. అతి బుల్లి పుష్పం ఉల్ఫియా పాంక్టేరియా. ఇది నీటిలో పెరిగే మొక్క. దీని ఆకు 0.7 మిల్లీ మీటరుంటుంది. మేరీ గోల్డ్ అనే ఓ అపురూప పూవుని పొందిన అలీస్ వాంక్ అనే అతనికి, అమెరికాకి చెందిన బర్పీ కంపెనీ 1945లో 20 వేల డాలర్ల బహుమతులిచ్చింది.

— అచ్యుతుని రాజ్యశ్రీ

ది. బాలుడికి పేరు పెట్టవలసిన సమయం రానేవచ్చింది.

"వీడి జాతకం వేయించి పేరుపెట్టాలి. పురోహితుణ్ణి పిలిపిస్తారా?" చిత్ర ఒకనాడు భర్తని అడిగింది.

"పురోహితుడికి కబురుచేస్తాను. అదేదో నువ్వే కానిచ్చేయ్" కృష్ణమోహన్ అంటీ ముట్టనట్లు అనేశాడు.

"మరి పార్టీ... లేదా భోజనాలు?" చిత్ర ఆ వేడుక గురించి ఊహించుకుంటూ అంది.

"ఆ ఏర్పాట్లూ చేయిస్తాను" కృష్ణమోహన్ ముక్తసరిగా అని ఊరుకున్నాడు. ఇంక భరించలేకపోయింది చిత్ర. కొన్ని నెలలుగా మనస్సులో అణిచిపెట్టుకున్న భావాలను, బాధను భర్త ముందు గుమ్మరించింది.

"తల్లిని కావాలనే వెర్రికోరికతో నేను మిమ్మల్ని చాలా బాధించి వుంటాను... కాని ఈ పరిస్థితి మనం సహజాతిసహజంగా స్వీకరించలేం అని నేను ముందుగానే చెప్పాను. కాని మీరు వినలేదు. ఇప్పుడిది జీవితకాల సమస్య. మీరు ప్రేమించలేని వీడిని నేను నిర్ద్వంద్వ భావంతో ఎలా ప్రేమించగలను? అలా అని వీడిని మీవలె ద్వేషించలేనండీ! మీరు వీడిని ద్వేషించడాన్ని నేను భరించలేను. అందుకని మీరు ఎవర్నో తెచ్చి పెంచుకున్నాం అని సరిపెట్టుకోవడం నేర్చుకోండి. నాతో మామూలుగా వుండండి.

"నువ్వలా ఎందుకనుకుంటున్నావ్?" కృష్ణమోహన్ నెమ్మదిగానే అన్నాడు.

"ఎందుకండీ ఇంకా దాస్తారు? ఎంతకాలం దాస్తారు?" చిత్ర రోషంగా అడిగింది.

కృష్ణమోహన్ బదులు చెప్పలేకపోయాడు.

"వాడు పెద్దయినాక హాస్టల్‌కి వెళ్లిపోతాడు. వెళ్లిపోతాడు. మీరు నిశ్చింతగా వుండండి" చిత్ర వెక్కిళ్లతోటి దుఃఖాన్ని ఆపుకుంటూ ఓడిపోయినట్లు తనలో తాను అనుకుంది. ఇంతలో ఊయలలో పిల్లవాడు నిద్రలేచి ఏడ్చాడు. చిత్ర అటువైపు కదిలింది.

బిడ్డ ఏడుపు ఆపేసి చిన్న చిన్న కళ్లతోటి తల్లివైపు... ఆ వెనుక నిలబడి వున్న కృష్ణమోహన్‌వైపు అమాయకంగా చూస్తున్నాడు. చూసి అమాయకంగా, నిశ్శబ్దంగా నవ్వుతున్నాడు.

◇ ◆ ◇

